క్లుప్తంగా

నృసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ



మంగళగిరి: పట్టణంలోని శ్రీ పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి రాగా ఎగువ సన్నిధులు భక్తులతో కలకలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈఓ ఏ రామ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏఐటీయూసీ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

తాడికొండ: ఏఐటీయూసీ జాతీయ సమావేశాలను విశాఖ నగరంలో సెప్టెంబర్ 1–3 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ కోరారు. తాడికొండ అడ్డరోడ్డులో శనివారం ఆటో వర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు. వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. బ్యాంకులు జీరో వడ్డీకే రుణాలు ఇవ్వాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. విశాఖ ఉక్కును కాపాడాలని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు మోదీ కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు, యూనియన్ నాయకులు రామయ్య, సురేంద్ర, వెంకట్రావు, ఉమా మహేశ్వరరావు, ఖాదర్ బాషా, సురేష్, జానీ, ఎజ్రా, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

దేశాన్ని ముందుకు నడిపించే నాయకులుగా ఎదగాలి

ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర మత్తే



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు దేశాన్ని ముందుకు నడిపించే నాయకులుగా ఎదగాలని ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే అన్నారు. అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల మెరిట్ క్యాంపస్‌లో శనివారం విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ మహేంద్ర మత్తే కేబినెట్ విద్యార్థులకు బ్యాడ్జీలు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని, కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. కెనడీ విద్యాసంస్థల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నికలను నిర్వహించి, స్కూల్ కేబినెట్ నాయకులుగా ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఎన్. ఐజాక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య పాల్గొన్నారు.

ఖాతాదారుల ఉన్నతికి యూబీఐ కృషి



కొరిటిపాడు(గుంటూరు): ఖాతాదారుల ఉన్నతికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) కృషి చేస్తోందని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్. జవహర్ స్పష్టం చేశారు. స్థానిక జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం సీనియర్ సిటిజన్స్, పెన్షన్‌దారులకు ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. యూబీఐ ఇప్పుడు సీనియర్ సిటిజన్స్, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తున్నట్లు తెలిపారు. 333 రోజుల డిపాజిట్ స్కీమ్‌లో యూబీఐ సీనియర్ సిటిజన్స్‌కు 7.90 శాతం వడ్డీ, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు 8.15 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్టు వివరించారు. పెన్షనర్స్ యూబీఐకి తమ సహాయ సహకారాలు లందించాలని కోరారు. కొత్త మదుపుదారాలను బ్యాంక్ ఖాతాలు తెరిచేలా చూడాలని పెన్షనర్స్‌ను కోరారు. అంతేకాకుండా వారి బంధు మిత్రులు, వారి కుటుంబ సభ్యులకు యూబీఐకి సంబంధించిన లోన్స్, డిపాజిట్లు గానీ తీసుకునేలా ప్రోత్సహించి బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

పోలీస్ తనిఖీల్లో 198 వాహనాలు సీజ్

నగరంపాలెం: నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనిమిది ప్రదేశాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఒక గంటపాటు ఆయా ప్రదేశాల్లో వచ్చే, పోయే వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన పత్రాలు, నంబర్ ప్లేట్లను, ముగ్గురు వెళ్లే వాహనాదారులను నిలిపివేశారు. పత్రాలు, నంబర్ ప్లేట్లను గుర్తించారు. ఈ క్రమంలో 198 వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో ఇద్దరు జిల్లా ఏఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడికొండలో దాహం దాహం

- తాగునీటి సరఫరా బంద్
- 20 రోజులుగా గ్రామస్తుల అవస్థలు
- మరమ్మతులు, వరద పేరుతో జాప్యం
- ప్రైవేటు నీటి ప్లాంట్లకు పెరిగిన తాకిడి



తాగునీటి సరఫరా పంపింగ్ స్టేషన్

తాడికొండ: రాజధాని ప్రాంతం. చెంతనే కృష్ణమ్మ గలగలలు. ఎగువ ప్రాంతాల్లో వరదలతో ప్రకాశం బ్యారేజీకి నీరు వచ్చి చేరింది. అయినా ప్రజల దాహం తీరలేదు. నూతన పాలకులు రాజధాని హడావుడి చేస్తున్నారు. సీఎం నుంచి ఉన్నతాధికారుల వరకు ఇక్కడే ఉన్నప్పటికి నియోజకవర్గ కేంద్రానికి నీటిని అందించడంలో విఫలమవుతున్నారు. 20 రోజులుగా తాడికొండ ప్రజలు నీటికి నోచుకోలేదు.

తాగునీటి పథకం ఇలా..

గ్రామంలో 40 వేల మంది జనాభా ఉన్నారు. తాగునీటి పథకం ఉంది. ఈ పథకం కింద తుళ్ళూరు మండలం హరిశ్చంద్రపురం నుంచి పంపింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి కృష్ణా నది నుంచి వడ్డమాను, అనంతవరం, పెదపరిమి గ్రామాల మీదుగా పైపులైన్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తాడికొండకు చేర్చిన తరువాత కొండపై ఉన్న నీటి ట్యాంకుకు నీటిని ఎక్కించి 4 విడతలుగా విభజించి గ్రామానికి నీటి సరఫరా చేస్తున్నారు. అయితే మరమ్మతులు, లీకులు పేరిట సరఫరాలో తలెత్తుతున్న లోపాల కారణంగా గ్రామస్తులకు వారానికి ఒకరోజు కూడా నీరందే పరిస్థితి లేదు. అడపాదడపాగా వస్తున్న తాగునీరు కూడా ఈ నెలలో పూర్తిగా పడకేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వరదల సాకుతో నీటి బంద్

వరదల సాకుతో తాగునీటి పథకానికి 15 రోజులకు పైగా నీటిని నిలిపేసిన అధికారులు, గుత్తేదారు ఇప్పుడు మరమ్మతులు వచ్చాయంటూ పైపులైన్‌ల రిపేరు పేరుతో వారం రోజులుగా నీటిని అందించడం లేదు. హరిశ్చంద్రపురం తాగునీటి సరఫరా కేంద్రం నిర్వహణ వ్యయం కింద 1000 లీటర్లకు రూ.3.25 చొప్పున గుత్తేదారుకు అందజేస్తారు. రోజుకు 12 లక్షల లీటర్ల నీటిని తాడికొండకు సరఫరా చేయాల్సి ఉంది. ఈ వాటర్ స్కీమ్‌ను తొలినాళ్లలో కేవలం తాడికొండ గ్రామానికే పరిమితం చేసి సరఫరా చేసేవారు. కానీ ఇప్పుడు హరిశ్చంద్రపురం, వడ్డమాను, అనంతవరం, నెక్కల్లు, పెదపరిమి గ్రామాలకు కూడా తాగునీటి సరఫరా చేస్తుండడంతో తాడికొండకు కృష్ణా జలాలు అందడం కష్టతరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా చేసినప్పటికీ ఇటీవల కాలంలో టీడీపీ అధికారంలోకి రాగానే గుత్తేదారును మార్చేశారు. ఈ నేపథ్యంలో సదరు గుత్తేదారుడు నిర్వహణపై అంతగా శ్రద్ధ కనబరచకపోవడం కారణంగా తరచుగా తాగునీటి సమస్య వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

20 రోజులుగా సరఫరా లేదు

వంకలు చెబుతూ నీటి సరఫరా లేకుండా ఇబ్బందులు పెడుతున్నారు. పైపులైన్లు, మరమ్మతులు, మోటార్లు మునిగిపోయాయి అంటూ 20 రోజులకోసారి కూడా నీరందించడం లేదు. 40 వేల జనాభా ఉన్న తాడికొండతో పాటు పలు గ్రామాలకు కృష్ణమ్మ చెంతనే ఉన్న దాహార్తి తీరడం లేదు. వసతి గృహాలు, ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు నీటి సరఫరా పెంచాలి

– చింతల భాస్కరరావు, సీపీఐ మండల కార్యదర్శి, తాడికొండ

ఏఈఈ ఏమన్నారంటే

అనంతవరం కోళ్ల ఫారాల వద్ద తాగునీటి పైపులైన్ పూర్తిగా పాడైపోయింది. ఆ స్థానంలో నూతన పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్నాం. మరమ్మతులు పూర్తి చేసి తాగునీరు అందజేస్తాం. కొద్ది రోజులు వరదల కారణంగా నీటి సరఫరాలో జాప్యం జరిగింది. రేపటి నుంచి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తాం.

– రేష్మ, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

20 నుంచి ఓటరు నమోదుకు ఇంటింటి సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ లక్ష్మీకుమారి

మంగళగిరి: ఓటర్ల నమోదులో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 20 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఈఆర్ఓ లక్ష్మీ కుమారి తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాజకీయపార్టీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీలోగా 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలుంటే ఫారం 7తో సవరణలు చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఓటును ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరొక పోలింగ్ స్టేషన్ పరిధిలోకి బదిలీ చేయుటకు ఫారం 8 సమర్పించాలని కోరారు. ప్రజలు బీఎల్ఓలకు అందుబాటులో ఉండి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకుడు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

దళితుల శ్మశాన వాటికను కాపాడండి

సబ్‌కలెక్టర్‌కు దళిత సంఘం నాయకుల వినతి



తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడిలో ఆక్రమణకు గురైన దళితుల శ్మశాన వాటిక ఆక్రమణలు తొలగించి దళితులకు అందజేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) డిమాండ్ చేసింది. శనివారం చింతలపూడిలోని ఆక్రమణకు గురైన దళితుల శ్మశాన వాటికను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పరిశీలించారు.

ఆయన మాట్లాడుతూ తాత ముత్తాతల నుంచి చింతలపూడిలోని ఇరిగేషన్ భూమిలో మృతి చెందిన వారిని ఖననం చేస్తున్నట్లు చెప్పారు. 40 అడుగుల వెడల్పు, 450 అడుగుల పొడవు ఉన్న శ్మశాన వాటికను పక్కనే ఉన్న అగ్రవర్ణాలకు చెందిన రైతులు ఆక్రమించుకుంటున్నారని, ఈ ఆక్రమణలపై నాలుగేళ్ల నుంచి పోరాటం చేస్తున్నట్లు గుర్తు చేశారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ సర్వే నిర్వహించి రాళ్ల పాతారని, బౌండ్రీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారని, కానీ రైతులు వచ్చిన అధికారులను, దళితులను బెదిరిస్తున్నారని, ఈ మధ్యకాలంలో ఎవరైతే ప్రశ్నిస్తారో వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వెంటనే ఉన్నత సాయి అధికారులు కలుగజేసుకుని దళితుల శ్మశాన వాటికను కాపాడాలని కోరారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పుడల్లా కొంత భూమిని ఆక్రమించుకుంటున్నారని, ప్రస్తుతం 10 అడుగుల భూమి మాత్రమే మిగిలిందని వివరించారు.

తెనాలి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

దళితుల శ్మశాన వాటిక ఆక్రమణకు గురైన విషయమై తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆక్రమణపై దుగ్గిరాల తహసీల్దార్ నుంచి నివేదిక తెప్పించుకుని వారంలోగా సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు డి.అమ్మిరెడ్డి, ఇమ్మానుయేలు, వెంకటేశ్వర్లు, సుందరరావు, రాయపూడి కోటేశ్వరరావు, అబ్రహాం మన్నవ రత్నకుమార్ పాల్గొన్నారు.

రాజధానిలో ఇనుము దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు

తాడికొండ: రాజధానిలో ఇనుము దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. శుక్రవారం ఇనుము దొంగిలించి తరలిస్తున్న వ్యక్తుల కదలికలను గమనించి ఎన్‌సీసీ సంస్థ సూపర్‌వైజర్ పి.బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఎస్ఐ అంకమ్మ ఆధ్వర్యంలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో మంగళగిరికి చెందిన ఆటో డ్రైవర్ శివ శంకర్, రాయపూడి గ్రామానికి చెందిన సత్యనారాయణ ఉన్నట్లు తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

డాక్టర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి కారకులైన వారికి వెంటనే శిక్షించాలని ఈమని పీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ సుభాని డిమాండ్ చేశారు. శనివారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోల్‌కతా ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

అనాథాశ్రమానికి బియ్యం అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నూతక్కిలోని మాతృచాయ అనాథాశ్రమానికి తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు శనివారం వంద కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యభౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న మాట్లాడుతూ కెఎల్‌యూ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ అనే కార్యక్రమంలో భాగంగా అనాథాశ్రమంలోని పిల్లలకు అవసరమైన సామగ్రిని అందజేసినట్లు చెప్పారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

ఆటోనగర్‌లో భారీగా విగ్రహాల తయారీ



ఆటోనగర్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు



మంగళగిరి: సంప్రదాయం ప్రకారం తొలి పూజ గణేశుడికి నిర్వహిస్తుంటాం. వినాయక చవితి వస్తుందంటే నెల రోజుల ముందే నుంచే సందడి వాతావరణం ఉంటుంది. తొలుత పల్లెల్లో పుట్టమట్టిని వినియోగించి నెల రోజుల ముందు నుంచే విగ్రహాలు తయారు చేసేవారు. వాటికి తోడు ఊరంతా సరిపోయే విధంగా చిన్నచిన్న ప్రతిమలను పంపిణీ చేసేవారు. వీధుల్లో.. వాడల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రానురాను ట్రెండ్ మారుతోంది. వీటి స్థానంలో రెడీమేడ్‌గా తయారు చేసి ఆ సమయానికి విగ్రహాలను విక్రయిస్తున్నారు.

విగ్రహాలకు ప్రసిద్ధి..

రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లతో పలు రాష్ట్రాల నుంచి వినాయక విగ్రహాల తయారీకి కళాకారులు కుటుంబాలు మంగళగిరి వచ్చి ఇక్కడ ఆటోనగర్ కేంద్రంగా వినాయక విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. సుమారు 20 కుటుంబాలు విగ్రహాలు తయారీలో నిమగ్నమయ్యారు. పాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో సైజుల వారీగా విగ్రహాలు తయారు చేయడం ప్రసిద్ధి. పందిళ్లలో వీధులలో పెట్టేందుకు భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు.

సైజుల వారీగా విగ్రహాల తయారీ..

విగ్రహం సుమారు రెండు అడుగుల నుంచి 20 అడుగులకుపైగా ఉంటాయి. విగ్రహాల సైజులను బట్టి అమ్మకాలు జరుగుతుంటాయి. మంగళగిరి ఆటోనగర్‌లోని వినాయక విగ్రహాల కోసం గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. తయారీ ముడి సరకు పెరగడంతో గతం కంటే విగ్రహాల ధరలు పెరిగాయి. కోవిడ్‌కు ముందు ఒక్క మంగళగిరిలోనే బాల గణపతి ఉత్సవ సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు వందకు పైగా పందిళ్లలో విగ్రహాలు పెట్టి పూజలు నిర్వహించి ఉత్సాహాలు చేసేవారు. అనంతరం తగ్గినా ఈ ఏడాది మరలా ఆ స్థాయిలో విగ్రహాలను పెట్టేందుకు బాల గణపతి ఉత్సవ సేవా సంఘం ప్రతినిధులు సిద్ధం అవుతున్నారు. ఇక గ్రామాలలోను భారీగా విగ్రహాలు ఏర్పాటుకు వినాయక ఉత్సవ కమిటీలు సిద్ధమవుతున్నాయి.

ధరలు ఇలా..

సైజును బట్టి ఒక విగ్రహం రూ.2 వేల నుంచి రూ.20 వేలకు పైగా ఉన్నాయి. గత కొద్ది కాలంగా పాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల కారణంగా పర్యావరణం దెబ్బతినకుండా ఏకో గణపతి విగ్రహాల వాడకం పెరిగింది. పర్యావరణాన్ని కాపాడాలంటూ వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో ఏకో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తుండడం పాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలపై ప్రభావం చూపుతుందని తయారీదారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 7వ తేదీన వినాయక చవితితో పాటు తొమ్మిది రోజుల పాటు వినాయక విగ్రహాల ఏర్పాటు చేసి పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు.

27, 28 తేదీల్లో అడ్వాన్స్ క్యాన్సర్‌పై జాతీయ సదస్సు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ తదితరులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న అడ్వాన్స్ క్యాన్సర్‌ను కార్యక్రమ పోస్టర్‌ను శనివారం కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే రోగి ప్రాణాలను కాపాడవచ్చని, క్యాన్సర్‌ను గుర్తించడానికి ఆధునిక టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగించాలనే విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. జాతీయ స్థాయి ట్రెండ్ ఇన్ ఏపీ జెనిటిక్స్ క్యాన్సర్ డయాగ్నోసిస్ మరియు థెరపి అనే పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను విడుదల చేసినట్లు చెప్పారు. ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే ఆధునిక టెక్నాలజీతో గుర్తించడానికి కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీ ద్వారా ఎలా ఉపయోగించాలనే ఇతర అంశాలపై ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ క్యాన్సర్ నిపుణులు మెడికల్ విద్యార్థులకు, బయో టెక్నాలజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. సదస్సుకు డాక్టర్ ఎం.జానకి రామయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్ కో కన్వీనర్‌గా, కోటేశ్వరరెడ్డి, జ్ఞాన శేఖరన్‌లు కోశాధికారులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, అకడమిక్స్ డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.జానకి రామయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన అమెరికా బృందం



కుంచనపల్లిలో ప్రకృతి వ్యవసాయం పొలాన్ని పరిశీలిస్తున్న అమెరికా బృందం

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం చాలా బాగుందని, అమెరికాకు చెందిన బృందం కితాబు ఇచ్చారు. అమెరికాకు చెందిన హెడ్ గ్రీన్ హైడ్రోజన్ ఆర్గనైజేషన్ బృందం కుంచనపల్లిలో ఆరుమళ్ల సాంబిరెడ్డి చేస్తున్న ఆర్గానిక్ వ్యవసాయాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు ఏరిక్ సోల్హీమ్ మాట్లాడుతూ ఆర్గానిక్ వ్యవసాయాన్ని ఇక్కడ రైతులు చాలా చక్కగా చేస్తున్నారని, ఇలాంటి వ్యవసాయం చేయడం వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం పంట పొలం వద్దే ఆర్గానిక్ స్టోర్‌ను పరిశీలించారు. తోటను పలు భాగాలుగా విభజించి అంతస్తులుగా ఏర్పాటు చేసి పండిస్తున్న పంటలను ఆయన పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై వెలుగు గ్రామ సంఘాలతోను, శాంతి మహిళా సంఘ సభ్యులతో అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పటికే చాలామంది ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, వాటి లాభాల గురించి తెలుసుకుంటున్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో అమెరికా బృందం సభ్యులు నిశాంత్ బాలషణ్ముఖం, దూబే పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో చిన్నారికి అరుదైన చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

మంగళగిరి: నగర పరిధిలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఆవరణలోని అమెరికా అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ (ఏఓఐ) మంగళగిరి ఆధ్వర్యంలో 12 ఏళ్ల బాలుడికి లైఫ్ సేవింగ్ సర్జరీ నిర్వహించారు. శనివారం వైద్యులు వివరాలను వెల్లడించారు. డాక్టర్ అయినంపూడి ఇషాంత్ నిర్వహించిన ఈ కేసు ఏఓఐ వద్ద పిడియాట్రిక్స్ అంకాలజీ కేర్‌లో గణనీయమైన విజయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అఖిల్ ఎస్‌కే అనే బాలుడు తొడ ఎముక యొక్క కుడి చివర అస్థియోస్కార్కోమాతో అనే క్యాన్సర్ జబ్బుతో బాధపడుతున్నాడు. సాధారణంగా పొడవాటి ఎముకలను ప్రధానంగా కాళ్లలో మరీ ముఖ్యంగా మోకాలి చుట్టూ ఇది ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. వేరే చోట అఖిల్ మూడు సార్లు కీమోథెరపీ చేయించుకున్నాడు. సర్జరీ చేస్తే కాలు తొలగించాల్సి ఉంటుందన్నారు. బాలుడి తల్లిదండ్రులు ఏఓఐ మంగళగిరిలో సంప్రదించగా డాక్టర్ అయినంపూడి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించారు. విజయంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. విజయవాడ, గుంటూరు, వైజాగ్, రీజియనల్‌లలో 12 ఏళ్ల చిన్నారిపై 8 ఏళ్ల తర్వాత విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించడం అభినందనీయమన్నారు. సీటీఎస్ఐ దక్షిణాఫ్రికా సీఈఓ డాక్టర్ హరీష్ త్రివేది మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్స విజయవంతం పిల్లల అంకాలజీలో వినూత్న పరిష్కారాల ప్రాముఖ్యతను హైలెట్ చాటుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓఐ రాష్ట్ర రీజియన్ ప్రతినిధి మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిపై దాడికి నిరసనగా ర్యాలీ



నుదురుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఫిరంగిపురం: కోల్‌కతాలో వైద్యవిద్యార్థిపై లైంగిక దాడి, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి నినాదాలు చేస్తూ పంచాయతీ కార్యలయం వరకు ర్యాలీ సాగింది. విధినిర్వహణలో ఉన్న వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు ఫరీనాబేగం, యానీ గ్రేస్ సిబ్బంది గాయత్రీదేవి, కె.సుదర్శన్‌రాజు, అబ్దుల్ రెహమాన్‌లు పాల్గొన్నారు. ఫిరంగిపురంలోని ఇమ్మి నర్సింగ్ కళాశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వ్యర్థాలను రోడ్లపై వేస్తే చర్యలు

గుంటూరు నగర కమిషనర్ శ్రీనివాసులు



పారిశుద్ధ్యంపై సిబ్బందిని ఆరా తీస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలోని ప్రధాన మార్కెట్‌ల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను రోడ్ల మీద వేయకూడదని, ప్రజారోగ్యం దృష్ట్యా రోడ్ల మీద వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం నందివెలుగు రోడ్డు విస్తరణ పనులు, బాలాజీ నగర్, కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్, రైతు బజార్, ఆనంద పేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పొన్నూరు రోడ్, ఏటుకూరు రోడ్‌లోని గార్బేజ్ డంపింగ్ పాయింట్స్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్, రైతు బజార్‌లను పరిశీలించి, అక్కడి వ్యాపారులతో మాట్లాడుతూ మార్కెట్‌ల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్ల మీద వేయడం వలన, వాటిని తొలగించడంలో జాప్యం జరిగితే దుర్గంధం వచ్చి ప్రజారోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మార్కెట్‌ల నుంచి వచ్చే వ్యర్థాలను కమర్షియల్ వ్యర్థాల సేకరణ వాహనాల ద్వారా తొలగించాలన్నారు. వ్యాపారస్తులు వ్యర్థాల నిర్వహణకు సహకరించాలని, ఇష్టానుసారంగా రోడ్ల మీద వేస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్‌లో ఆశీలు వసూళ్ల టెండర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నందివెలుగు రోడ్ విస్తరణలో భాగంగా నగరపాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన పనుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. అనంతరం పొన్నూరు రోడ్, ఏటుకూరు రోడ్‌లోని డంపింగ్ యార్డ్‌లను పరిశీలించి ప్రతి రోజు వస్తున్న వ్యర్థాల వివరాలు, జిందాల్‌కి పంపుతున్న వ్యర్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో డీఈఈ శ్రీధర్, శానిటరీ సూపర్ వైజర్ అయూబ్ ఖాన్, ఏఈ సునీల్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సలాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.ఐజాక్, ఏడుకొండలు పాల్గొన్నారు.